సాక్షి అనకాపల్లి

ఆదివారం । 7 । మే । 2023



శ్రావ్యంగా గాత్ర కచేరి

విశాఖ: కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఎ.లక్ష్మీ సూర్యతేజ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి.



డెయిరీ డీజీఎంకు డాక్టరేట్

ఏయూక్యాంపస్: విశాఖ డెయిరీ డీజీఎం ఉగ్గిన చిట్టోడు కార్మికుల హక్కులపై జరిపిన పరిశోధనకు ఏయూ డాక్టరేట్ లభించింది.



పంట నష్టంపై అవగాహన

అకాల వర్షాల వల్ల పంటనష్టం జరగకుండా అవగాహన కల్పించాలని జిల్లా ప్రత్యేక అధికారి జె.నివాస్ ఆదేశించారు. IIలో

న్యూస్‌రీల్

అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వితే కఠిన చర్యలు

అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి



గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

మునగపాక: అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన రామారాయుడుపేట ప్రాంతాన్ని శనివారం అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పరిశీలించారు. రెండు రోజుల క్రితం రామారాయుడుపేటలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్న విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతంలో పొక్లెయిన్ తోపాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఆమె మైన్స్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రావెల్ తవ్వకంతోపాటు తరలింపునకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తు అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వితే తగు చర్యలు తీసుకోవాలని మైన్స్ అధికారులను ఆదేశించారు. వీఆర్వో పర్యవేక్షణ ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

'కలియుగ భగవాన్' చిత్ర యూనిట్‌కు సత్కారం



మునగపాక: సమాజానికి మేలు చేకూర్చే సందేశాత్మక చిత్రాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వర్ధమాన దర్శకుడు కోరుకొండ గోపీకృష్ణ తెలిపారు. ఆయన దర్శకత్వం వహించిన 'కలియుగ భగవాన్' చిత్ర యూనిట్ శనివారం రాత్రి మునగపాక వచ్చింది. దర్శకుడు గోపీకృష్ణతోపాటు మాటల రచయిత విల్లూరి జగ్గప్పారావు, నటుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మను మునగపాక కళాకారులు ఘనంగా సత్కరించారు. గోపీకృష్ణ అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించి, సాంబశివుని ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మునగపాక కళాకారులు కోరుకొండ ప్రసాద్, పెంటకోట విజయ్, జగన్, కేపీరావు, ప్రసాద్, వేగి కుమార్, ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్టోరీ ఆఫ్ బ్యూటిఫుల్ గర్ల్' చిత్ర బృందం సందడి



డ్యాన్స్ చేస్తున్న హీరో నిహాల్, హీరోయిన్ ద్రిషిక

అనకాపల్లి టౌన్: స్థానిక డైట్ కళాశాలను శనివారం 'స్టోరీ ఆఫ్ బ్యూటిఫుల్ గర్ల్' చిత్రబృందం సందర్శించింది. హీరోయిన్ ద్రిషిక మాట్లాడుతూ విద్యార్థులందరూ చిత్రాన్ని థియేటర్లలో మాత్రమే చూడాలని కోరారు. డైరెక్టర్ బోడపాటి రవిప్రకాష్ మాట్లాడుతూ పైరసీని ప్రోత్సహించవద్దని కోరారు. చిత్రంలోని పాటకు హీరో నిహాల్, హీరోయిన్ ద్రిషిక డ్యాన్స్ చేసి విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు

విశాఖపట్నం: పకడ్బందీగా పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా పాలిసెట్ కో–ఆర్డినేటర్ కేడీవీ నరసింహారావు తెలిపారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల నిర్వాహకులతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 38, భీమిలిలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగరాన్ని ఆరు రూట్లుగా విభజించి పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు.

సర్కారు స్కూళ్లు అదరహో

- పదో తరగతి ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు
- ప్రైవేట్‌కు దీటుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలలు
- సత్ఫలితాలిచ్చిన వంద రోజుల ప్రణాళిక
- గతేడాది కన్నా మెరుగైన ఫలితాలు
- జిల్లాలో 77.74 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో అనకాపల్లికి ఐదో స్థానం
- శతశాతం సాధించిన పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు

జిల్లాకు 5వ స్థానం | 77.74% | బాలికలదే పైచేయి

ఫస్ట్‌క్లాసులే అధికం	పాసైనవారి సంఖ్య	ఫస్ట్‌క్లాస్	సెకెండ్ క్లాస్	థర్డ్‌క్లాస్
	17,221	12,906	3021	1,294

సాక్షి, అనకాపల్లి: పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు అదరహో అనిపించారు. శనివారం విడుదలైన ఫలితాల్లో 77.74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు రావటం, రాష్ట్ర సూచికలో అనకాపల్లి జిల్లా ఈ ఏడాది ఐదో స్థానం దక్కించుకోవటంతో ఇది సమష్టి విజయమని విద్యాశాఖాధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలు సాధించాయి. ఉత్తీర్ణతలో బాలురు కంటే బాలికలే పైచేయిగా నిలిచారు. జిల్లాలో 399 ఉన్నత పాఠశాలల్లో 22,151 విద్యార్థులకు 17,221 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 10,952 మందికి గానూ 8,901 మంది (81.27 శాతం), బాలురు 11,199 మందికి 8320 మంది (74.29 శాతం) పాసయ్యారు. 500 మార్కులకు పైగా సాధించినవారు 4,100 మంది వరకు ఉన్నారు. అచ్యుతాపురం ఏపీ గురుకుల పాఠశాలలో చదివిన కామిరెడ్డి హేమశ్రీ, మాకవరపాలెం మండలం గిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన సింగంపల్లి తనూజ అత్యధిక మార్కులు సాధించిన వారిలో ఉన్నారు.

శతశాతం 60 పాఠశాలలకు..

జిల్లాలో 60 ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీటిలో 11 ప్రభుత్వ పాఠశాలలు, 49 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. శతశాతం ఉత్తీర్ణత సాధించిన వాటిలో ఐదు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఒక ప్రభుత్వ పాఠశాల, రెండు ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్), ఒక ఏపీఎంఎస్, ఒక కేజీబీవీ ఉన్నాయి. కేజీబీవీ(చీడికాడ), ఏపీ మోడల్ స్కూల్ (మందాల), ఏపీ సోషల్ వెల్ఫేర్ పాఠశాల (దేవరాపల్లి), బీసీ వెల్ఫేర్(ఎస్.రాయవరం), ఏపీ గురుకుల పాఠశాల (అచ్యుతాపురం), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కలిగొట్ల), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బైలపూడి), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (చీడికాడ) శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

జూన్ 2 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ

పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. జూన్ 2 నుంచి 10 వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయి. వీటికి హాజరయ్యే విద్యార్థులు ఆదివారం నుంచి ఈ నెల 17 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు.

జవాబు పత్రాలను పరిశీలించుకోవచ్చు

విద్యార్థుల రాసిన జవాబు పత్రాలను పరిశీలించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందుకోసమని రూ.1000లను ఈనెల 13 లోపు చెల్లించినట్లయితే జవాబు పత్రాలను రీ–వెరిఫికేషన్ చేసుకోవటంతోపాటు, వాటి జెరాక్స్ ప్రతులను సైతం విద్యార్థులకు అందుకోవచ్చు. అదే విధంగా రీకౌంటింగ్ కోసం రూ.500లు ఫీజు చెల్లించాలి.



గిడుతూరు హైస్కూల్ విద్యార్థిని తనూజకు స్వీట్ తినిపిస్తున్న పేరెంట్స్ కమిటీ చైర్మన్ అచ్చిరాజు

ఫెయిలైన విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు



ఉత్తీర్ణత శాతంలో జిల్లా రాష్ట్రంలోనే ఐదో స్థానంలో ఉండడం చాలా ఆనందదాయకం. వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయటం ద్వారానే ఆశించిన స్థాయిలో ఫలితాలు వచ్చాయి. ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు, పర్యవేక్షణాధికారుల సమష్టి కృషి ఫలితమిది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కార్పొరేట్‌కు దీటైన ఫలితాలు సాధించటం శుభ పరిణామం. విజేతలైన విద్యార్థులకు అభినందనలు. రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తాం. ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తాం.

–వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

కల నెరవేర్చిన కలాసీ కూతురు

దేవరాపల్లి/అచ్యుతాపురం: అచ్యుతాపురం బాలికల గురుకుల పాఠశాలలో చదివి జిల్లాలోనే అధిక మార్కులు సాధించిన విద్యార్థిగా నిలిచిన కామిరెడ్డి హేమశ్రీ స్వగ్రామం దేవరాపల్లి మండలం కొత్తపెంట. తండ్రి కామిరెడ్డి శ్రీనివాసరావు విశాఖపట్నం పూర్ణ మార్కెట్‌లో కలాసీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి గోవిందమ్మ గృహిణి. కూతురిని బాగా చదివించాలన్నది వారి కల. వారి ఆశలను నిజం చేస్తూ హేమశ్రీ మంచి మార్కులు సాధించడంతో వారింట ఆనందం పరవళ్లు తొక్కింది.



కామిరెడ్డి హేమశ్రీకి స్వీటు తినిపిస్తున్న తల్లి గోవిందమ్మ

ఇంజినీర్ కావడమే నా జీవితాశయం

ఇంజనీర్ కావడమే నా జీవితాశయం. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను అర్థమయ్యే రీతిలో మలుచుకుని ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షలకు సిద్ధమయ్యాను. ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతి వరకు స్వగ్రామం కొత్తపెంట ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేశాను. ఇక్కడ చదువుతుండగానే అచ్యుతాపురం గురుకులంలో 5వ తరగతిలో సీటు వచ్చింది. మా నాన్న కలాసీగా రాత్రి పగలు తేడా లేకుండా పనిచేస్తూ నన్ను చదివించారు. ఇంజినీరింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నది నా ఆశయం. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో మంచి మార్కులు సాధించాను. –కామిరెడ్డి హేమశ్రీ

ప్రభుత్వాస్పత్రుల్లో సకల సదుపాయాలు

- అందుబాటులో 63 రకాల పరీక్షలు.. 172 రకాల మందులు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్
- చౌడువాడ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



చౌడువాడ ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న కమిషనర్ నివాస్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కె.కోటపాడు: వైద్యాధికారులు ఆస్పత్రుల్లో వైద్యం అందించడంతోపాటు అన్ని విభాగాల పనితీరును పర్యవేక్షించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ అన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి శనివారం సాయంత్రం చౌడువాడ పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో 63 రకాలైన పరీక్షలను చేపట్టేందుకు అవసరమైన మౌలిక వసతులను సమకూర్చినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షల సమయంలో ఎటువంటి అవసరాలు వచ్చినా ఆస్పత్రి అభివృద్ధి నిధులను ఖర్చు చేసుకోవచ్చునని నివాస్ తెలిపారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేయడంతోపాటు అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. మెరుగైన వైద్యం అందించడంతోపాటు 172 రకాలైన మందులను వ్యాధిగ్రస్తులకు అందిస్తున్నట్టు జె.నివాస్ తెలిపారు. ఆస్పత్రిలో ప్రసవాలను పెంచేలా చర్యలను తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో సమకూర్చాల్సిన మౌలిక వసతుల వివరాలను కమిషనర్‌కు వైద్యాధికారులు నిర్మల, సుబ్రమణ్యం తెలిపారు. కమిషనర్ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్, వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రనాథ్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీ రాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

రాజీకే అధిక ప్రాధాన్యం

ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఈనెల 13న నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ కోర్టులకానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసులు రాజీ అయ్యే విధంగా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐలకు అప్పగించిన తీవ్ర, సాధారణ, ముఖ్యమైన కేసుల్లో పురోగతి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పీపీలు, కోర్టు కానిస్టేబుళ్లతో ఎస్‌హెచ్‌వోలు సమన్వయం చేసుకోవాలని సూచించారు.నేరం చేసే వారికి తగిన శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కోర్టుల్లో జరిగే వాదనల వివరాలు ఎప్పటికప్పుడు డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో, కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్.లక్ష్మణ్ మూర్తి, సీఎంఎస్ ఎస్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

టెన్త్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నర్సీపట్నం: పదో తరగతి పరీక్ష తప్పిన విద్యార్థిని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అప్రమత్తమై హుటాహుటిన 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామానికి చెందిన పెదపూడి రేవతి నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ (తురకబడి)లో పదో తరగతి చదువుతోంది. శనివారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో రెండు సబ్జెక్టులు తప్పడంతో మనస్తాపానికి గురై చీమల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది.

మృత్యు కెరటం

- సరదాగా బీచ్‌కు వచ్చిన నలుగురు విద్యార్థినులు
- కెరటాలు లాక్కుని పోవడంతో కాపాడిన మత్స్యకారుడు
- ఆస్పత్రికి తరలిస్తుండగా ఒకరు మృతి

ఎస్.రాయవరం: వేసవి సెలవులకు స్వగ్రామానికి వచ్చామన్న ఆనందం వారిలో ఆవిరైంది. నలుగురు విద్యార్థినులు శనివారం రేవుపోలవరం బీచ్‌లో సరదాగా గడుపుదామని వచ్చిన కాసేపటికే విషాదం నెలకొంది. మృత్యు రూపంలో వచ్చిన సముద్రపు అలలు ఒకరిని బలి తీసుకున్నాయి. అయితే కళ్లముందే తన కుమార్తెను కెరటాలు లాక్కుని పోతుంటే, మృతురాలి తల్లి గుండె పగిలేలా రోదించిన తీరు వర్ణనాతీతంగా మారింది.

కోటవురట్ల మండలం బాపిరాజు కొత్తపల్లి గ్రామానికి చెందిన వరసకు అక్కాచెల్లెళ్లు అయిన మృతురాలు తమ్మండ్రి హర్షిత(13), పెదపూడి ఉషశ్రీ, పెదపూడి అంబిక, పెదపూడి జాహ్నవి శనివారం రేవుపోలవరం తీరానికి వచ్చారు. వీరితోపాటు మృతురాలి తల్లి ఉమామహేశ్వరి ఉంది. అక్కడ కాసేపు సరదాగా గడిపిన వీరు స్నానానికి తీరంలో దిగారు. ఇంతలోనే పెద్ద కెరటం వచ్చి హర్షిత, ఉషశ్రీలను లాక్కుని పోయింది. కాస్త ఒడ్డున ఉన్న అంబిక, జాహ్నవి, ఉమామహేశ్వరి కేకలు వేశారు. సమీపంలో మత్స్యకారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గనగళ్ల రాజేష్ తీరంలో దిగి మునిగిన ఇరువురిని కాపాడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఉషశ్రీ ప్రాణాలతో బయటపడినప్పటికి, హర్షిత అపస్మారక స్థితికి చేరుకుంది. హుటాహుటిన నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి హర్షిత మృతి చెందినట్టు నిర్ధారించారు. కళ్ల ముందు జరిగిన ఘోరం చూసి కన్నతల్లి గుండె పగిలేలా రోదించింది. హర్షిత కడుపులో ఉన్నప్పుడు తండ్రి కరెంటు షాక్‌తో మృతి చెందాడని, కుమార్తే జీవితం అనుకుని అల్లారు ముద్దుగా చూసుకుంటే, తమ బిడ్డను సంద్రం మింగేసిందని బోరుమంది. ఇక తానెందుకు బతకాలని గుండెలవిసేలా రోదిస్తున్న తీరు చూసే వారిని కంటతడి పెట్టించింది. ఎస్.రాయవరం పోలీసులు కేసు నమోదు చేశారు.



కెరటం తాకిడికి మృతి చెందిన హర్షిత



కన్నీరు మున్నీరవుతున్న మృతురాలి తల్లి ఉమామహేశ్వరి

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

నర్సీపట్నం:మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై శనివారం డీఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్ విచారణ జరిపారు. కొట్లాట ఘటనలో బాధితుల నుంచి వివరాలు సేకరించారు. దాడిలో గాయపడిన దనియా మహేష్‌ను విచారించారు. అనంతరం మరో నలుగురిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. దళిత యువకుడిని అకారణంగా కొట్టి చంపేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుని, దాడులు పునరావృతం కాకుండా చూడాలని దళిత సంఘాల నాయకులు ఎ.ఈశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు, చైతన్యలు డీఎస్పీ ని కోరారు. డీఎస్పీ వెంట సీఐ గణేష్, ఎస్ఐ గోవిందరావు ఉన్నారు.

యువతి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్: ప్రేమించి మోసపోయిన ఓ యువతి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పట్టణ ఎస్ఐ దివాకర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి మండలం మూలపేటకు చెందిన గీతా గాయత్రి (24) మూడు సంవత్సరాల క్రితం ఏఎంఎఎల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నప్పుడు బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన మహేష్‌ను ప్రేమించింది. అప్పటి నుంచి వివాహం చేసుకుంటానని మహేష్ నమ్మబలుకుతున్నాడు. గీతా గాయత్రి ప్రస్తుతం తగరపువలసలోని జ్యూయలరీ షాపులో పనిచేస్తోంది. పెళ్లి విషయమై గాయత్రి అడుగ్గా అనుమానిస్తూ మహేష్ వేధించేవాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం పురుగు మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన ఆమె తండ్రి అడపా వెంకటరమణ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దివాకర్ తెలిపారు.

శతశాతంతో సత్తా చాటి..

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విజయకేతనం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటాయి.పలు పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలిచాయి.

మంచి మార్కులు సాధించిన విద్యార్థులు



హేమశ్రీ, అచ్యుతాపురం ఏపీ రెసిడెన్సియల్ స్కూల్



పవన్‌కార్తీక్, నాతవరం హైస్కూల్

అచ్యుతాపురం(అనకాపల్లి): పదవ తరగతి ఫలితాల్లో అచ్యుతాపురం ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించారు. 75 మంది పరీక్షలకు హాజరు కాగా శతశాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. 50 మంది విద్యార్థులకు 500 మార్కులకు పైగా లభించాయి. కామిరెడ్డి హేమశ్రీ, ధర్మిరెడ్డి కావ్య, భార్గవి,తనకాల యమున,యాళ్ల ప్రత్యూషలకు ఉత్తమ మార్కులు లభించాయి. అచ్యుతాపురం ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపాల్ మధు విద్యార్థులను అభినందించారు. దోసూరు ఉన్నత పాఠశాలలో 83.3 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 42 మంది పరీక్షకు హాజరు కాగా, 35 మంది పాసయ్యారు. కొండకర్ల ఉన్నత పాఠశాలకు చెందిన వెలుగుల మధుశ్రీ మంచి మార్కులు సాధించింది.

ఎస్.రాయవరం:మండలంలో మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఏకైక పాఠశాలగా గత ఏడాది ప్రారంభమైన ఈ స్కూల్‌లో మొదటి సారిగా 22 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై శత శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 14 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు పొందారు. మిగిలిన 8 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణి మార్కులు సాధించారు.ఈ పాఠశాలలో చదువుతున్న కోటవురట్ల మండలం లింగాపురానికి చెందిన లోకవరు రేష్మ మంచి మార్కులు సాధించింది. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గారా శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

నాతవరం/నర్సీపట్నం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నాతవరం హైస్కూల్‌కు చెందిన కొమ్ముర్రు పవన్ కార్తీక్ మంచిమార్కులు సాధించాడు. ఎంఈవో తాడి అమృత్‌కుమార్, హెచ్ఎం కాశపు శివరాంప్రసాద్, ఉపాధ్యాయులు కార్తీక్‌ను అభినందించారు. నాతవరం గ్రామానికి చెందిన పవన్‌కార్తీక్ తండ్రి టైలరింగ్ చేస్తుంటారు. నర్సీపట్నం జెడ్పీ హైస్కూల్ (మెయిన్)కు చెందిన కె.ఓంకార్ మంచి మార్కులు సాధించడంతో ఉపాధ్యాయులు అభినందించారు.

మాకవరపాలెం: గిడుతూరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న సింగంపల్లి తనూజ ఉత్తమ మార్కులు సాధించింది. కొండలఅగ్రహారం గ్రామానికి చెందిన తనూజ తండ్రి అప్పలనాయుడు మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో, తల్లి పద్మ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నారు. తనూజ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సూచనలతో అధిక మార్కులు సాధించినట్టు తెలిపింది. తనూజను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ డి.అచ్చిరాజు, హెచ్ఎం రత్నం అభినందించారు.



ఓంకార్‌ను అభినందిస్తున్న నర్సీపట్నం జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయులు

శతశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు ఇవే..

- అచ్యుతాపురంలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్
- దేవరాపల్లి మండలంలో ముషిడిపల్లి, ఎ.కొత్తపల్లి, వేచలం, కలిగొట్ల జెడ్పీ హైస్కూళ్లతోపాటు తెనుగుపూడి గురుకుల విద్యాలయం
- ఎస్.రాయవరంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల
- చీడికాడ మండలంలో మంచాల ఏపీ మోడల్ స్కూల్, చీడికాడ ప్రభుత్వ హైస్కూల్, బయలుపూడి జెడ్పీ హైస్కూల్, జి.కొత్తపల్లిలోని కస్తూర్బా బాలికా విద్యాలయం

పంట నష్టం జరగకుండా రైతులకు అవగాహన

జిల్లా ప్రత్యేక అధికారి నివాస్

తుమ్మపాల: అకాల వర్షాల వల్ల పంటనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లాప్రత్యేక అధికారి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర సంచాలకులు జె.నివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనలు అనుసరించి పల్లపు భూముల రైతులను అప్రమత్తం చేయాలన్నారు. వరి కోతలు చేపట్టకూడదని, ఉద్యానవన పంటలకు తగు రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టాలన్నారు. రబీలో వరి, కూరగాయలు, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, పంట పరిస్థితులపై ఆరా తీశారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంతో పాటు, నాడు-నేడు, సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. జిల్లా స్వరూపం, పరిస్థితులు, పంటల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, సీపీవో జి.రామారావు, మత్స్యశాఖ ఏడీ లక్ష్మణరావు, డీఎల్‌డీవో మంజులావాణి, డీపీవో శిరీషా రాణి, పౌరసరఫరాల శాఖ డీఎం శ్రీలత, డీఎస్‌వో సుబ్బరాజు పాల్గొన్నారు.

జెడ్పీలో 88 మందికి కారుణ్య నియామకాలు

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర

నాతవరం: జిల్లా పరిషత్‌లో 88 మందిని కారుణ్య నియామకాల ద్వారా నియమించామని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జి.సుభద్ర చెప్పారు. నాతవరం మండలానికి మొదటిసారిగా వచ్చిన ఛైర్‌పర్సన్‌కు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి శనివారం ఘన స్వాగతం పలికారు. ఎంపీడీవో కార్యాలయంలో నాయకులతో సమావేశమై పలు అంశాల గురించి ఆమె చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిన కారుణ్య నియామకాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఆయా కుటుంబాలను ఆదుకున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో రూ.35 కోట్లతో పనులు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.17 కోట్లతో ఉమ్మడి జిల్లా వ్యా ప్తంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో దివ్యాంగులకు కావలసిన ఉపకరణాలకు రూ.5 లక్షలు సమకూర్చుతున్నామని, హైస్కూళ్లలో విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని రూ.5 లక్షలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల నిర్వహణకు జెడ్పీటీసీ సభ్యులకు రూ.26 లక్షల చొప్పున నిధులు ఇచ్చామన్నారు.

జెడ్పీటీసీ అప్పలనర్స కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండ

ఇటీవల అనారోగ్యంతో మరణించిన జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స భర్త వెంకటరమణకు ఛైర్‌పర్సన్ శ్రద్ధాంజలి ఘటించారు. అప్పలనర్సను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు దొండా రాంబాబు ఆధ్వర్యంలో సమకూర్చిన లక్ష రూపాయలను, పంచాయతీరాజ్ శాఖ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ అందించిన రూ.5 వేలను ఆమె అప్పలనర్సకు అందజేశారు. గొలుగొండ, కొయ్యూరు, రావికమతం, చింతపల్లి మండలాల జెడ్పీటీసీ సభ్యులు సుర్ల వెంకట గిరిబాబు, వారా నూకరాజు, తలారి రమణమ్మ, పోతురాజు బాలయ్యపడాల్, నాతవరం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, స్థానిక సర్పంచ్ గొలగాని రాణి, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్‌పర్సన్ శెట్టి నూకరాజు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బిందు సేద్యం విస్తరణ లక్ష్యం 1200 హెక్టార్లు

జిల్లా సూక్ష్మ సాగు నీటి ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మి

నాతవరం: సూక్ష్మ నీటి పథకంలో జిల్లాలో ఈఏడాది 1200 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా సూక్ష్మ సాగు నీటి ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.లక్ష్మి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది 600 హెక్టార్ల లక్ష్యానికి గాను అదనంగా 832 హెక్టార్లలో డ్రిప్ స్పింకర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈఏడాది ఇంతవరకు 1,176 హెక్టార్లలో డ్రిప్ స్పింకర్ల ఏర్పాటుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు చెప్పారు. రైతుల దరఖాస్తులను ఈనెల 15 నుంచి పరిశీలిస్తామని తెలిపారు. స్పింకర్ల ఏర్పాటు కోసం జిల్లాలో నాలుగు కంపెనీలను ప్రభుత్వం ఎంపిక చేసినట్టు చెప్పారు. వాటిలో రైతులు కోరుకున్న కంపెనీ ద్వారా పరికరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు హౌసింగ్ జేఈ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సత్యనారాయణపురంలో నేడు గడప గడపకు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమం మండలంలో సత్యనారాయణ పురం పంచాయతీ-1 పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయుచున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా అన్నమాచార్య జయంతి



జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్ : రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెక్షన్ హాలులో అన్నమాచార్య 615వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 32 వేల పైచిలుకు అన్నమాచార్య సంకీర్తనలు రచించి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటారన్నారు. కార్యక్రమంలో అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందం వ్యవస్థాపకుడు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరాంబ జయంతి



సత్యసాయిబాబా మందిరంలో బాలబాలికల నృత్యాలు

కశింకోట: కశింకోటలోని కోమటి వీధిలో ఉన్న ఆలయంలో సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరాంబ జయంతి వేడుకలు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బాల వికాస్ బాలబాలికలతో వారి తల్లిదండ్రులకు పాద పూజ చేయించారు. భజన, నృత్య, నాటికలు ప్రదర్శించారు. బాబా భజన మండలి కన్వీనర్ ముక్కా అప్పలనాయుడు, బాల వికాస్ గురువులు అవసరాల సీతా కామేశ్వరి, కోడూరి చిన్నమ్మలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 516 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	------	-----
మొదటి రకం	4,480	4,740
రెండో రకం	3,770	4,400
మూడో రకం	3,000	3,750

అనకాపల్లి సినిమాలు

అరంగేట్రం	రాజా
రామబాణం	సత్యనారాయణ స్క్రీన్-
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (తెలుగు 3డి)1	
	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 412 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

టెన్త్‌లో బాలికలు అదరగొట్టారు...





అత్యధిక మార్కులు సాధించిన కొవ్వాడ మోక్షిత, దోకుల బిందు

కశింకోట : కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన టెన్త్ పరీక్షా ఫలితాల్లో బాలికలు మెరిశారు. ఇద్దరు బాలికలు అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. కొవ్వాడ మోక్షిత, దోకుల బిందు, కె.రాకేష్ 570కిపైగా మార్కులు సాధించారు. ఈ పాఠశాల నుంచి 132 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 90 మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వీరిలో పది మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించారన్నారు. స్థానిక బాలికల హైస్కూల్లో టెన్త్ పరీక్షల్లో 78 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి తెలిపారు. 115 మంది పరీక్షలు రాయగా 90 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 15 మంది 500 పైబడి మార్కులు సాధించారన్నారు.

తేగాడ ఆదర్శ పాఠశాలలో 95.8 శాతం ఉత్తీర్ణత: తేగాడ వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 95.8 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 96 మంది పరీక్షలు రాయగా 92 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో రోహిత్ ఈశ్వర్, శిరీష , హర్షిణి 570పైగా మార్కులతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం తెలిపారు.

బయ్యవరం హైస్కూలు నుంచి 49 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 34 మంది ఉత్తీర్ణులై 70 శాతం సాధించారు. వీరిలో ఉరికిటి కాసమ్మ, నగిరెడ్డి సందీప్ అత్యధిక మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్టు హెచ్‌ఎం రమణశ్రీ తెలిపారు. తేగాడ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ 37 మంది విద్యాలయంలో 78 శాతం మంది టెన్త్‌లో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ డి.చంద్రకళ తెలిపారు. వీరిలో 37 మంది బాలికలు పరీక్షలు రాయగా 29 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో యల్లపు ధరణిసంతోషి అత్యధిక మార్కులు సాధించారన్నారు. తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 68.75 శాతం మంది టెన్త్‌లో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం తెలిపారు. 80 మంది పరీక్షలు రాయగా, 55 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. పి.కావ్యశ్రీ, యు.వనిత , బి.ఉషారాణి అత్యధిక మార్కులతో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా నిలిచారన్నారు. తాళ్లపాలెం హైస్కూలులో 48.95 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో వి.రోహిత్, ఆర్.బావ్యశ్రీ, డి.భాగ్యలక్ష్మి అత్యధిక మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. నరసింగబిల్లి హైస్కూల్లో 137 మంది టెన్త్ పరీక్షలు రాయగా 78 మంది ఉత్తీర్ణులయ్యారని హెచ్‌ఎం సుమమణి తెలిపారు. వీరిలో బుదిరెడ్డి చంద్రశేఖర్ అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు.

కన్నూరుపాలెంలో...

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం హైస్కూల్లో 75 మంది టెన్త్ పరీక్షలు రాయగా 56 మంది ఉత్తీర్ణులయ్యారు. చిరికి హేమలత అత్యధికంగా అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కొత్తపల్లి హైస్కూలులో తక్కువ శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక్కడ 85 మంది పరీక్షలు రాయగా 39 మంది ఉత్తీర్ణులై 46 శాతం పొందారు. ఉమ్మిణ గణేష్ అత్యధిక మార్కులు పొందారు. దురుపర్తి హైస్కూల్లో 8 మంది పరీక్షలు రాయగా ఆరుగురు, జమాదులపాలెం హైస్కూలులో 30 మందికి 18 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒమ్మి జనని అత్యధిక మార్కులు పొందారు. ఏఎస్ పేట హైస్కూలులో 14 మందికి పది మంది ఉత్తీర్ణులయ్యారు. ఎ.కె.ఆర్ మణింద్ర స్కూలుకి ప్రథమంగా నిలిచారు.

తుమ్మపాల హైస్కూల్లో 74 శాతం ఉత్తీర్ణత

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఎన్ శ్రీనివాసరావు తెలిపారు.గత నెలలో జరిగిన పదో తరగతి పరీక్షలకు పాఠశాల నుంచి 132 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 98 మంది ఉత్తీర్ణులైనట్టు చెప్పారు. వీరిలో ఏడు గురికి 500 కి పైగా మార్కులు వచ్చాయని తెలిపారు. పీఎంవి ప్రశాంతి అత్యధిక మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిందని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించారు...

తుమ్మపాల : ప్రభుత్వం శనివారం విడుదల చేసిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో సర్కారు బడుల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు.

- పదో తరగతి పరీక్షల్లో అనకాపల్లి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థిని కె.సాయిశ్రీ జాహ్నవి అధిక మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు.
- మండలంలో కొత్తూరు ఎయిడెడ్ పాఠశాలలో 100 మంది బాలురు, 79 మంది బాలికలు పరీక్షలు రాయగా 80 మంది బాలురు, 65 మంది బాలకలతో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన అల్లు భానుశ్రీ అత్యధిక మార్కులతో టాపర్‌గా నిలిచారు.
- 96.61శాతం ఉత్తీర్ణతతో పట్టణంలో గల రెసిడెన్షియల్ స్కూల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. 59 మందిగాను 57 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బి.జయదేవ్ పాఠశాల టాపర్‌గా నిలిచాడు.
- జీవీఎంసీ 6 పాఠశాలల్లో 198 మంది బాలురు, 252 మంది బాలికలకుగాను 128 మంది బాలురు, 198 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో దోసూరి హన్షిత టాపర్‌గా నిలిచారు. గాంధీనగరం హైస్కూల్‌కు చెందిన సీహెచ్.రేణుక, పెద్ద హైస్కూల్‌కు చెందిన పవన్‌రాజా , ఎంజీహెచ్ స్కూల్‌కు చెందిన దొడ్డి లహరి, భీమునిగుమ్మం హైస్కూల్‌కు చెందిన పి.గాయత్రిలక్ష్మి అత్యధిక మార్కులతో విజయ దుందుభి మోగించారు.
- హిమశేఖర్ పాఠశాలకు చెందిన వై.ముఖేష్‌మనోహర్ టాపర్‌గా నిలిచాడు. టి.రష్మిక , ఎస్.చరణ్ , బి.జ్యోత్స్న, ఎ.లిఖిత అత్యధిక మార్కులు సాధించగా పాఠశాలకు 90 శాతం ఉత్తీర్ణత దక్కిందని కరస్పాండెంట్ కె.జనార్ధన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.సురేష్, ఉపాధ్యాయులు గోపీకృష్ణ, శేషు, కృష్ణ, జగన్, పుష్ప అప్పలరాజు పాల్గొన్నారు.



హిమశేఖర్ హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ కె.జనార్థన్

గురుకుల పాఠశాలకు ఉత్తమ ఫలితాలు

తుమ్మపాల : పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. అత్యధిక మార్కులతో బి.జయదేవ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. సైన్స్‌లో 100 శాతం, తెలుగు, గణితంలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. దేదవ కుమార్ రెండవ స్థానం, వంశీ మూడో స్థానం, కిరణ్ నాలుగో స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం 59 విద్యార్థులకుగాను 530 మార్కులు దాటిన వారు 15 మంది, 500 మార్కులు దాటిన వారు నలుగురు ఉన్నారన్నారు. 96 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల హవా

కశింకోట: కశింకోటలోని శ్రీ వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూలు టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించింది. స్కూలుకు చెందిన ఎస్.నేహకుమారి అత్యధిక మార్కులు సాధించి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మండలానికి ప్రథమంగా నిలిచారని కరస్పాండెంట్ మళ్ల జగదీష్ తెలిపారు. షేక్ రిజ్వాన, ఎస్.ప్రవీణ్‌నాయుడు,, పెంటకోట హర్షవర్ధన్‌వరుసగా ద్వితీయ, తృతీయ, చతుర్థి స్థానాలు సాధించారన్నారు. వీరిని ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు శనివారం అభినందించారు.

సెయింట్ జాన్స్‌లో శత శాతం ఉత్తీర్ణత

సెయింట్ జాన్స్ స్కూలులో టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ బత్తుల నోబుల్‌కుమార్ తెలిపారు. మళ్ల భవ్యశ్రీ, ఎ. మేఘనశర్మ, వేగి దినేష్ అత్యధిక మార్కులు పొంది వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. తాళ్లపాలెం గాయిత్రీ స్కూల్లో కాలెపు తేజస్విని, డి.దుర్గాచైతన్య, జి.దివ్య అత్యధిక మార్కులతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని కరస్పాండెంట్ బి.రామ్ కుమార్, ప్రిన్సిపాల్ వై.నగేష్ తెలిపారు.



టెన్త్‌లోఅత్యధిక మార్కులు పొందిన ఎస్.నేహకుమారిని అభినందిస్తున్న స్కూలు యాజమాన్యం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



జోగారావుపేట పాఠశాలలో ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్



స్వయం సహాయక సంఘాలకు స్త్రీ నిధి, బ్యాంకు లింకేజ్ చెక్కు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట : అర్హతను ప్రామాణికంగా తీసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని రాష్ట పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని పేరంటాలపాలెం శివారు జోగారావుపేట గ్రామంలో శనివారం ×గడప గడపకు మన ప్రభుత్వం× కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై రూపొందించిన కర పత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల,మత, పార్టీలతో సంబంధం లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను గ్రామాల్లో అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సేవలందించడానికి హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. నియోజక వర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరగా, అందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ పువ్వల సన్యాసి రావు , జెడ్పీటీసీ సభ్యురాలు మంగతాయారు, ఎంపీడీవో కొంకి అప్పారావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం జోగారావుపేటలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోగారావుపేట, పేరంటాలపాలెం గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడం కోసం రూ.14.05 లక్షలతో నిర్మించిన 40 కిలోలీటర్లు, 20 కిలోలీటర్ల రక్షిత మంచినీటి పథకాలను ప్రారంభించారు.

రూ.19.40 లక్షలతో జోగారావుపేట ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పథకం ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. 19 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి స్త్రీ నిధి కింద మంజూరైన రూ.కోటి 80 లక్షల చెక్కును పంపిణీ చేశారు. రూ.16 లక్షలతో డిజిటల్ గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ గృహ నిర్మాణాల తొలగింపు



సర్వే నంబర్ 357లో గృహాలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ గంగాధరరావు అన్నారు. మండలంలో మారేడుపూడి గ్రామంలో సర్వేనంబర్ 357లో అక్రమంగా నిర్మిస్తున్న 9 గృహాలను శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిరుపేదలకు ప్రభుత్వం జగనన్న గృహాలు ఇవ్వడం జరుగుతుందని, అర్హత కలిగిన లబ్ధిదారులు సచివాలయల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. జాతీయ రహదారికి దగ్గరలో సర్వేనంబర్ 357లో కొంతమంది ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా గృహాలు నిర్మిస్తున్నారని, అటువంటి వారిపై రెవెన్యూ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్, ఎస్ఐ నరసింగరావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రమేష్, వీఆర్వో, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మైక్రో ఏటీఎం ద్వారా పాస్‌పుస్తకాల ముద్రణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏపీజీవీబీ అడ్మిన్ ఆనంద్, జిల్లా ఎల్‌డీఎం సత్యనారాయణ

కశింకోట : ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పరిధిలో మైక్రో ఏటీఎం ద్వారా పాసు పుస్తకాలు ముద్రణను దేశంలోనే ఇక్కడ తొలిసారిగా చేపట్టినట్లు ఏపీ గ్రామీణ వికాస బ్యాంకు అడ్మిన్ టి.ఆనంద్ వెల్లడించారు. మండలంలోని సోమవరం గ్రామంలో మొదటి సారిగా మైక్రో ఏటీఎం ద్వారా బ్యాంకు మిత్ర కేంద్రంలో బ్యాంకు పాసు పుస్తకాల ముద్రణ కార్యక్రమాన్ని జిల్లా ఎల్‌డీఎం సత్యనారాయణతో కలిసి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మైక్రో ఎటీఎం ద్వారా పాసు పుస్తకాల ముద్రణ అయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐరిక్స్ టెక్నాలజీ సంస్థ అభివృద్ధి చేసినట్టు తెలిపారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఖాతాదారులు మైక్రో ఏటీఎం ద్వారా పాసు పుస్తకాల ముద్రణ సేవలు బ్యాంకుల వరకు రాకుండా గ్రామాల్లోనే పొందవచ్చునన్నారు. దేశంలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం కంటె ఐరిక్స్ పరిజ్ఞానం ఉత్తమమైనదని అభినందించారు. ఇక్కడిలాగే మిగిలిన బ్యాంకు మిత్ర కేంద్రాల్లో ఇటువంటి సదుపాయం కల్పించాలన్నారు. ఐరిక్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కనకరాజు, ఐరిక్స్ సంస్థ రాష్ట్ర ఇన్‌ఛార్జి చిరంజీవి, ఆర్‌ఒ హెడ్ సంతోష్, ఛానల్ మేనేజర్లు నాగేశ్వరరావు,రామకృష్ణ, రమణ, బిడిఎం రాజీవ్, గ్రామీణ వికాస బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరెడ్డి, బ్యాంకు మిత్ర లక్ష్మీ తనూజ, పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో భవనాలు నిర్మించాలి



రికార్డులను పరిశీలిస్తున్న దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్ : నాణ్యతా ప్రమాణాలతో కూడిన భవనాలను నిర్మించాలని విశాఖ జీవీఎంసీ డీఈఈ దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక భీమునిగుమ్మం హైస్కూల్ ఆవరణలో కొత్తగా స్మార్ట్‌సిటీ భవన నిర్మాణ పనులను, రికార్డులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణ పరిధిలో మూడు స్మార్ట్‌సిటీ స్కూల్ భవనాలను రూ.6.76 కోట్ల నిధులతో నిర్మాణ పనులు, 60 శాతం పనులు పూర్తయినట్టు ఆయన తెలిపారు. మరో రెండు మాసాల్లో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. భవితరాల విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని భవనాలు నిర్మాణ పనులు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 83వ వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్, భవననిర్మాణ కాంట్రాక్టర్ ప్రసాద్, జీవీఎంసీ అధికారుల పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అవసరం



విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్

అనకాపల్లిటౌన్: నిరుపేద విద్యార్థులను ధనవంతులు చదివించినట్లయితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ చైర్మన్ పి.విజయ్ కుమార్ అన్నారు. స్థానిక శారదకాలనీలో ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పేద విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినట్లయితే భవితరాల ప్రజలకు మేలు చేయవచ్చనే దృఢసంకల్పంతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి విద్యను ప్రభుత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి తన సంపాదించిన కొంత నగదులో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సహాయం చేయాలని ఆయన కోరారు. 20సంవత్సరాలుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లాలో ఏడాదికి మూడుసార్లు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎం.శ్యామల, సోంబాబు, ఎస్.ప్రసాద్, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమండపానికి ప్రారంభోత్సవం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్ : కల్యాణ మండపాలు ఏర్పాటు చేయడంతో వివిధ రకాలైన కార్యక్రమాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. గవరపాలెం దిబ్బవీధిలో సీతారామ దేవస్థానం ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణమండపాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామదేవస్థానం అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో కల్యాణ మండపాన్ని నిర్వహించడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో 80, 81వార్డులు కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, పార్టీ నాయకులు పి.రాంబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

కశింకోట : కశింకోటలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి వరలక్ష్మి తెలిపారు. వచ్చే జూన్ 11 వరకు జరిగే శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, చిత్ర లేఖనం, పేపర్ ఆర్టు, థియేటర్ ఆర్టు, సృజనాత్మక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కార్యక్రమాలుంటాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

తుమ్మపాల: అమ్మాయిలకు రక్షణగా దిశా యాప్ పనిచేస్తుందని దిశా పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు దివ్య, కె.సావిత్రి అన్నారు. పట్టణంలో డీవీఎస్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర యువజన సర్వీసుల విభాగం ఆధ్వర్యంలో దిశా యాప్, విద్యార్థుల భవిష్యత్తు కెరీర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ దిశా యాప్ ద్వారా అమ్మాయిల పట్ల తప్పుగా ప్రవర్తించే అబ్బాయిల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. ఇంటర్నెట్ విస్తృతంగా వినియోగిస్తున్న తరుణంలో ఆన్‌లైన్ మోసాలు జరిగే తీరుపై అవగాహన చేసారు. యుక్త వయసులో ఉన్న అమ్మాయిల విషయంలో ప్రేమ అంటూ వలవేసి కొందరు ఆకతాయిలు మోసం చేస్తున్నారని, అలాంటి సందర్భాల్లో దిశా యాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. యువజన సర్వీసులు విభాగం మేనేజర్ బి.నూకరాజు, కళాశాల అధ్యాపకులు జమీర్, కె.రాజేష్, వై.శ్యామల, జి.సౌజన్య పాల్గొన్నారు.

ఎర్ర చెరువు ఆక్రమణలు తొలగించాలి



కొత్తూరులో ఎర్ర చెరువును పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

అనకాపల్లి రూరల్: కొత్తూరు పంచాయతీలో ఉన్న ఎర్ర చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలు తక్షణమే తొలగించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఎర్ర చెరువు ప్రాంతాన్ని ఆ పార్టీ నేతలు పరిశీలించారు. చెరువులు, గెడ్డలు వంటి జలవనరుల ఆక్రమణలపై రెవెన్యూ ఉన్నతాధికారులు ఉదాసీనంగా ఉండడం మంచిదికాదని సీపీఐ నేతలు అభిప్రాయపడ్డారు. వెంటనే కొత్తూరు సర్వే నంబరు 613/2 లో ఉన్న 16.77 ఎకరాల ఎర్ర చెరువుకు సమగ్ర సర్వే చేయించాలని సీపీఐ పార్టీ నేతలు రాజాన దొరబాబు, కోన లక్ష్మణ కోరిబిల్లి శంకర్రావు, నరాల శెట్టి సత్యనారాయణ సాయి లక్ష్మణ, కొల్లి సత్యారావు, రమణ, సాయి డిమాండ్ చేశారు. ఎర్ర చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటును నిలిపివేయాలని వారంతా జిల్లా కలెక్టరును కోరారు.

జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించాలి



విలేకరులతో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు అన్నారు. స్థానిక చదువులవారివీధి జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. చర్యలు తీసుకోని పక్షంలో పార్లమెంట్ పరిధిలో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకూ ప్రజల నుంచి అభియోగపత్రాలను స్వీకరిస్తామన్నారు. జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి చెరకు రైతులను ఆదుకోవాలని కోరారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా కొన్ని గ్రోయిన్స్‌ను మరమ్మతు పనులు చేస్తున్నట్టు ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ నాయకులు రవిరాజు, కర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.